క్లుప్తంగా

ఖాళీ కుర్చీలకు శిక్షణ!



ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌లో శిక్షణ ఇస్తున్న ట్రైనర్

ఉయ్యాలవాడ : స్థానిక మోడల్ స్కూల్‌లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 32 పాఠశాలలు ఉండగా కేవలం నాలుగు పాఠశాలలకు చెందిన ఎస్‌ఎంసీ చైర్మన్లు మాత్రమే హాజరయ్యారు. శిక్షణలో పాల్గొన్న ఎంఈఓ వీర ప్రతాప్‌రెడ్డి.. కలెక్టర్‌తో సమావేశం ఉండటంతో శిక్షణ నుంచి నంద్యాలకు వెళ్లి పోవడంతో హాజరైన ఎస్‌ఎంసీ చైర్మన్లు కూడా వెళ్లిపోయారు. దీంతో ట్రైనర్లు ప్రధానోపాధ్యాయులు, ఖాళీ కుర్చీలకు ట్రైనింగ్ ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదు



మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివరావు

ఉయ్యాలవాడ : జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని ఏపీడీ సాంబశివరావు ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా కేవలం 5 గ్రామ పంచాయతీల్లో మాత్రమే ఉపాధి పనులు జరగడంపై సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పనులు చూపాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): క్రిస్మస్,జనవరి పండుగలను పురస్కరించుకొని స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. నంద్యాల డయాసిస్ పరిధిలోని ఫాస్టేట్–3 జట్టు విజేతగా నిలవగా.. జట్టుకు డీసరీ చైర్మన్ రెవరెండ్‌నందం, ఐజక్ గురువులు,డయాసిస్ సెక్రటరీ స్టాన్లీ విలియమ్స్,సెక్రటరీ ప్రేమ్‌నాథ్, పాస్టర్ రవీంద్రబాబు ట్రోఫీ అందజేసి అభినందించారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

ఉసేన్‌స్వామి దర్గాలో భక్తుల రద్దీ



ఫాతేహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం, తదితర జిల్లాల నుంచి భక్తులు తరలిరావడంతో దర్గా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామివారికి పూలదట్టీలు, జెండాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు పూలే విగ్రహ ప్రతిష్ఠ

డోన్ టౌన్: స్థానిక బాలకల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, డోన్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. సమాజంలో బడుగుబలహీనవర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన పూలే దంపతుల విగ్రహాలను నెలకొల్పడం హర్షించదగ్గ విషయం అన్నారు.



చిలకలూరు వద్ద కాల్వలోని నీటిని ఆయిల్ ఇంజిన్ సాయంతో తరలిస్తున్న దృశ్యం,



చందలూరు సమీపంలో వాగులోని నీటిని తోడుతున్న ట్రాక్టర్లు

నీటి కష్టాలు

- కీలక దశలో జొన్న
- వాగులు,వంకల్లోని నీటిని ట్రాక్టర్ల సాయంతో తోడుతున్న రైతులు

రుద్రవరం: మండల పరిధిలోని చిలుకలూరు,ఎర్రగుడిదిన్నె,చందలూరు,పేరూరు గ్రామాల పరిధిలోని రైతులకు సాగు నీటి కష్టాలు తలెత్తాయి. సాగు చేసిన జొన్న పంట కీలక దశలో ఉండటం, ప్రస్తుతం నీటి తడులు అత్యవసరం కావడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఆయా గ్రామాల పరిధిలోని రైతులు రబీ సీజన్ కింద దాదాపు 2వేల ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. తెలుగుంగ కాల్వలు,చెరువుల నుంచి సాగు నీరు అందడంతో పంటకు తడులు సులువుగా పారించుకున్నారు. అయితే రెండు రోజుల నుంచి తెలుగుగంగ కాల్వలో సాగు నీటి సరఫరా తగ్గడంతో సమస్య మొదలైంది. ప్రధాన కాల్వలో నీరు తగ్గడంతో ఉప ప్రధాన కాల్వల్లో నీటి పారకం తగ్గింది. చివరి ఆయకట్టుకు సక్రమంగా అందక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం జొన్న పంట కంకి దశలో ఉంది. ఒక్క తడి పారించుకుంటే పంట సమృద్ధిగా పండుతుంది. నీటి తడులకు ఖర్చులు పెరుగుతున్నప్పటికీ లెక్క చెయ్యక ఎక్కడ నీరు ఉంటే అక్కడి నుంచి దూరమైనప్పటికీ ట్రాక్టర్లు,ఆయిల్ ఇంజిన్ల ద్వారా నీటిని పారించుకుంటున్నారు. తెలుగుగంగ కాల్వకు నీటిని పుష్కలంగా విడుదల చేస్తే ఈ అవస్థలు, అదనపు ఖర్చులు ఉండవని అన్నదాతలు పేర్కొంటున్నారు.

చుట్టల్లా చుట్టేసి..

దొర్నిపాడు: మండలంలో వరి నూర్పిళ్లు జోరుగా సాగుతున్నాయి. నూర్పిళ్లు పూర్తయిన తరువాత వరి గడ్డిని పశువులకు ఆహారంగా వినియోగిస్తారు. దీంతో గ్రాసం కొరత తక్కువగానే ఉంటుంది. కొంత కాలంగా వరి పంటను మిషన్లతో కోయిస్తున్నారు. ఈ పద్ధతి రైతులకు చాలా అనువుగా మారింది. మిషన్‌తో కోతలు చేయించడం ద్వారా వరి గడ్డి చెల్లాచెదురు అవడమే గాకుండా ముక్కలుగా మారి ఎక్కువగా వృథా అవుతోంది. అలాగే గ్రాసం తరలించడానికి రైతులు, పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించేందుకు ఇటీవల గడ్డిని చుట్టలుగా చుట్టే యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. వీటితో కూలీల ఇబ్బందులకు పరిష్కారం లభించడమే కాకుండా పొలాల్లో చెల్లాచెదురైన గడ్డిని కుప్పగా చేయడానికి అవస్థలు తప్పాయి. ప్రస్తుతం గడ్డిని చుట్టలుగా మారుస్తుండటంతో రైతులు వాటిని సులభంగా తరలించుకెళ్లి వాములు వేసుకుంటున్నారని, తమకు ఈ పద్ధతి అనుకూలంగా ఉందని అన్నదాతలు పేర్కొంటున్నారు.



దొర్నిపాడు శివారు పొలాల్లో వరి గడ్డిని చుట్టలుగా చుట్టిన దృశ్యం

అందరి సమన్వయంతోనే గ్రామాభివృద్ధి



మాట్లాడుతున్న డీపీఓ జమీవుల్లా

నంద్యాల(అర్బన్): అందరూ సమన్వయంతో పని చేస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమతుందని జిల్లా పంచాయతీ అధికారి జమీవుల్లా అన్నారు. గ్రామ సమస్యలు, పరిష్కారాలపై గురువారం మండలంలోని చాపిరేవుల గ్రామంలో సర్పంచ్ రాజు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. సచివాలయ సిబ్బందితో పాటు ప్రజలు పాల్గొన్న సమావేశంలో గ్రామ సమస్యలపై ముఖాముఖి చర్చించారు. అనంతరం డీపీఓ మాట్లాడుతూ గ్రామ సభ దృష్టికి వచ్చిన ప్రతి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎంపీడీఓ సుగుణశ్రీ, ఈఓఆర్‌డీ జ్యోతి, పీఎస్ ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను కలెక్టరు రాజకుమారి ఆవిష్కరించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో పీఆర్‌టీయూ అధ్యక్షుడు రామఫక్కీర్‌రెడ్డి, కార్యదర్శి సయ్యద్‌చాంద్‌బాషా, జిల్లా వర్కింగ్‌ప్రసిడెంట్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా అన్ని జీవోలు పొందుపరిచి పక్కగా క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమన్నారు. నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మైనర్ ఇరిగేషన్ శాఖ ఈఈ బొల్లవరం రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతున్న సంఘం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రప్ప, తిరుపాలయ్య,కోశాధికారి శ్రీనివాసులు,ఉపాధ్యక్షుడు ఫకృద్దీన్, విజయలక్ష్మి, సత్యం, దిబ్బన్న, యేసురత్నం పాల్గొన్నారు.

నేడు చిన్నవంగలి పాల సొసైటీకి నామినేషన్లు

చాగలమర్రి: మండలంలోని చిన్నవంగలి గ్రామంలో గతేడాది డిసెంబరు 4న నిర్వహించాల్సిన పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్ల ఎన్నికను నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎలాంటి కారణం లేకుండా పోలీసుల ద్వారా అర్థంతరంగా వాయిదా వేశారు. ఎన్నికల నిర్వహణకు గత నెల 30న నోటిఫికేషన్ ఇవ్వడంతో ఈ నెల 3వ తేదీన నామినేషన్లు స్వీకరించనున్నారు. సొసైటీలో 85 మంది సభ్యులకు ఓటు హక్కు ఉంది. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్ల హెన్నికలకు సంబంధించి విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ జి.ప్రదీప్‌కుమార్ గతేడాది డిసెంబర్ నెల 30న నోటిఫికేషన్ విడుదల చేసి షెడ్యూల్ ప్రకటించారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 4న సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, 7వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నిక నిర్వహణ, అనంతరం ఓట్ల లెక్కింపు తరువాత ఫలితాలు ప్రకటించనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఎన్నికల అధికారిగా నంద్యాల విజయ డెయిరీ సీనియర్ సూపర్‌వైజర్ సి.రామకృష్ణారెడ్డి, అసిస్టెంట్ ఎలక్షన్ అధికారులుగా సీనియర్ సూపర్‌వైజర్లు వై.నాగిరెడ్డి, ఎస్.పద్మయ్య వ్యవహరించనున్నట్లు తెలిపారు.

గోకులం షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గోవిందనాయక్

పగిడ్యాల: గోకులం షెడ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గోవింద నాయక్ అన్నారు. గురువారం మండలంలోని పాత, కొత్త ముచ్చుమర్రి, నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు గ్రామాల్లోని షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకున్న వెంటనే బిల్లులు బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. ఈనెల 12వ తేదీలోగా నిర్మాణాలన్ని పూర్తి చేసుకునేలా ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం ముచ్చుమర్రి గ్రామంలో జరిగే గొంతువాపు నిరోధక టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే శాఖాపరంగా పశుపోషకులకు అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. లక్ష్యాలను పూర్తి చేసేందుకు సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. ఆయన వెంట జూపాడుబంగ్లా డివిజన్ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రామాంజినాయక్, పశువైద్యులు రాగసంధ్య, ఈసీ అశోక్, టీపీ వసుంధర, వీరేష్, చరిత తదితరులు ఉన్నారు.

వికసిత్ భారత్ యంగ్‌లీడర్స్ చాలెంజ్‌కు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ చాలెంజ్ నేషనల్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కళాశాల డేటా సైన్స్ విభాగం నుంచి అమీర్‌ఉసేన్, హిమబిందు ఈనెల 11, 12 తేదీల్లో న్యూఢిల్లీలోని నేషనల్ యూత్ ఫెస్టివల్ పాల్గొంటారన్నారు. జాతీయ వేదికపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమక్షంలో ఫైనల్‌లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్ శాంతిరాముడు, డైరెక్టర్ శివరామ్, సిబ్బంది లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

డోన్ టౌన్: పట్టణంలోని షాదిఖానా రహదారిలో హరికి చెందిన దుకాణంలో గురువారం (బంక్) ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. బంక్ సమీపంలో చెత్తా చెదారంపై ఎవరో సిగరేట్ పీక పడేయడంతో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.10 వేల విలువ చేసే వస్తువులు అగ్నికి ఆహుతైనట్లు సమాచారం. లీడింగ్ ఫైర్‌మెన్‌లు శ్రీరాములు, ప్రభాకర్, ఫైర్‌మెన్‌లు రాజశేఖర్, నాగేంద్రబాబు, ఆపరేటర్ రంగస్వామి ఉన్నారు.

రేపటి నుంచి జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం

శిరివెళ్ల: ఈ నెల 4వ తేదీ నుంచి జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతుందని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గురువారం తెలిపారు. తమ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియెట్ విద్యార్థులు 80 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 91 మంది ఉన్నారన్నారు. వారికి జెడ్పీ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలు భోజనం సరఫరా చేస్తారని చెప్పారు. పాఠశాలలో అమలవుతున్న మెనూనే కళాశాలలో కూడా అమలవుతుందని పేర్కొన్నారు.

నేడు మాలల సమావేశం

నంద్యాల(అర్బన్): స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని నిశాంత్ భవన్‌లో శుక్రవారం రాయలసీమ మాలల యుద్ధ గర్జన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్సీ,ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు లింగస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 23న కర్నూలులో జరిగే సభకు సంబంధించి సమావేశం నిర్వహిస్తున్నామని, కులస్తులందరూ హాజరు కావాలని కోరారు.

మట్టి పరీక్షలు తప్పనిసరి

నంద్యాల(అర్బన్): పంట కోతలు పూర్తయిన తర్వాత పొలాన్ని దుక్కిదున్నక ముందే రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవాలని ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ జాన్సన్, భూసార శాస్త్రవేత్త జయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షల ద్వారా నేలల్లోని పోషకాల లభ్యతను తెలుసుకొని రైతులు వేయబోవు పంటకు అవసరమయ్యే మోతాదు మేరకు ఎరువులు వాడవచ్చన్నారు. దీని ద్వారా సాగు ఖర్చులు తగ్గడమే కాకుండా నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. రైతులు తన పొలంలో ప్రతి ఐదేళ్లకు ఒక సారి మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్‌లో మట్టి, నీటి పరీక్షలు నిర్వహిస్తున్నామని, అందులో మట్టి పరీక్షకు రూ.300, నీటి పరీక్షకు రూ.250 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల మెట్ట సమీపంలో గురువారం పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి పేకముక్కలు, రూ. 4,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అంకిరెడ్డిపల్లెలో 8 మంది అరెస్ట్

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో గురువారం పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.7వేల స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

సావిత్రీబాయి సేవలు మరువలేనివి



హెచ్‌ఎంకు సావిత్రీబాయి పూలే చిత్ర పటాన్ని అందజేస్తున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: సమాజంలో బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యాభివృద్ధికి పాటుపడిన సమాజ సేవకురాలు సావిత్రిబాయి పూలేను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం సావిత్రిబాయి పూలే చిత్ర పటాలను మండలంలోని అన్ని పాఠశాలలకు పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా జడ్జి మాట్లాడుతూ.. పూలే దంపతులు సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి సమాజ సేవకు వారి జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టారని చెప్పారు. వితంతు వివాహాలను ప్రోత్సాహించారని, మహిళా విద్య కోసం ప్రత్యేకంగా బాలికా పాఠశాలను ప్రారంభించారని తెలిపారు. ఈమె జ్ఞాపకార్థం మహారాష్ట్రలోని పూణేలో యూనివర్సిటీ స్థాపించారని చెప్పారు. లోక్ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పూలే చిత్రపటాలను హెచ్‌ఎంలకు అందజేశారు. జడ్జిని సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, బాలికల పాఠశాల హెచ్‌ఎం మైమున్నీసా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యూ సభలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

ఉయ్యాలవాడ : భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రెండో విడత రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. గురువారం మండలంలోని కొండుపల్లె గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు.గ్రామంలో 362 మంది రైతులకు చెందిన 896.02 ఎకరాల్లో రెండు సంవత్సరాల క్రితం భూముల రీ సర్వే చేశారు. అయితే గ్రామంలో రెవెన్యూ అధికారులు తప్పిదాల వల్ల భూముల కొలతల్లో తేడాలు, సరిహద్దు కందకాల్లో సర్వే నంబర్లు గుర్తించడంలో పొరపాట్లు చోటు చేసుకున్నాయని రైతులు రెండేళ్ల నుంచి రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని ప్రజా సమస్యల వేదికలో అర్జీలు సమర్పించినా పరిష్కారం కాలేదని మరోసారి గ్రామసభలో రైతులు నిరసన గళం విప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్‌ఓ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

నంద్యాల(అర్బన్): గత నెల 6న ప్రారంభమైన గ్రామ రెవెన్యూ సదస్సులు గురువారంతో ముగిశాయి. మండలంలోని పులిమద్ది గ్రామంలో నిర్వహించిన చివరి రెవెన్యూ సదస్సుకు రెండు దరఖాస్తులు వచ్చాయి. సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ ప్రియదర్శిని మాట్లాడుతూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులన్నింటికీ తక్షణ పరిష్కారం చూపనున్నామన్నారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ రఘురామిరెడ్డి, డీటీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడలో 11 గంటల సమయంలో ప్రజల కోసం గ్రామసభలో వేచి చూస్తున్న కార్యదర్శి

మొక్కుబడిగా గ్రామసభలు

- ఆసక్తి చూపని ప్రజలు
- వార్డు సభ్యుల గైర్హాజరు

ఉయ్యాలవాడ : గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతులు, ప్రణాళికలపై గురువారం మండలంలో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు మొక్కుబడిగా సాగాయి. ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడుస్తున్నా ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఆశలు సన్నగిల్లడంతో కనీసం అర్జీలు ఇచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపలేదు. చేసేదేమి లేక అధికారులు మాత్రమే హాజరై రాజకీయ నాయకులతో గ్రామసభలు మమ అనిపించారు. మండల కేంద్రంలో సర్పంచ్ మేకల ఓబులేసు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఉదయం 11 గంటలైనా గ్రామసభకు ప్రజలు హాజరు కాకపోవడంతో అధికారులు ఎదురు చూడాల్సి వచ్చింది. పంచాయతీలో వార్డు సభ్యుల పాత్ర కీలకం. అయినా వారి పట్ల అధికారులు వివక్ష చూపడంతోనే గ్రామసభకు 12 మంది వార్డు మెంబర్లు ఉండగా సభకు ఒక్కరూ కూడా హాజరు కాలేదు. వార్డు సభ్యుల గైర్హాజరుపై గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డిని వివరణ కోరగా సభ నిర్వహణపై సభ్యులకు ఒక రోజు ముందే తెలియజేశామన్నారు. ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, ఎంపీటీసీ గగ్గెర వెంకటేశ్వర్లు, టీడీపీ మండల కన్వీనర్ బోరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు అవసరం



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

కొత్తపల్లి: రైతులు పంటలసాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులతో పాటు తెగుళ్లను నివారించవచ్చని నంద్యాల జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి కె.హేమలత అన్నారు. గురువారం మండలంలోని నందికుంట, గువ్వలకుంట్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పంట పొలాలను సందర్శించి తెగుళ్ల నివారణపై తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. మినుము, కంది పంటలో సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌లో కంది పంట సాగుచేసిన రైతులు రైతు సేవా కేంద్రంలో కందుల కొనుగోలు కోసం ముందస్తుగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. అదే విధంగా సహకార పరపతి సంఘాల్లోని రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. విత్తన శుద్ధి ఆవస్యకతను తెలియజేశారు.పొలంలో అక్కడక్కడా జిగురు పసుపు రంగు రేకులు, అట్టలు ఉంచుకోవాలని సూచించారు. కందిలో వచ్చే ఎండుతెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. మండల వ్యవసాయాధికారి మహేష్, ఎంపీటీసీ సభ్యుడు బాలరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు శివకృష్ణ నాయక్, జాహిద్, పశుసంవర్ధక సహాయకుడు శివనాయక్ పాల్గొన్నారు.

వేప మొదలులో మర్రి మొలిచెన్

'ఇనుములో హృదయం మొలిచెనే' అంటూ గతంలో ఓ సినీ కవి హోయలు పోయాడు. కానీ ఇక్కడ ఒక వేప చెట్టు తన మొదలుపై గాలివాటున పడిన మర్రి విత్తనానికి మొలిచేందుకు అనుమతినివ్వడంతో అది చక్కగా మొలకెత్తింది. వేప చెట్టు మొదట్లో మొలచిన మర్రి మొక్క కొత్తపల్లె మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా చూపరులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

– ఆత్మకూరురూరల్

